# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 27-09-2024 | సంపుటి : 06 | సంచిక : 04 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## దేవరదొడ్డి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల అనుమానాస్పద మృతి

చిత్తూరు ,బైరెడ్డిపల్లి మండలంలోని దేవదొడ్డి వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతుంది. శుక్రవారం ఉదయం వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు..చిత్తూరు జిల్లా, పలమనేరు నియోజకవర్గం లోని బైరెడ్డిపల్లి మండలం, దేవరదొడ్డి గ్రామం వద్ద గురువారం అర్ధ రాత్రి ఎన్ హెచ్ వర్క్ చేస్తున్న బయట రాష్ట్రాలకు చెందిన ఇద్దరిని కొట్టి చంపినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు మాట్లాడలేని కారణంగా దొంగలనుకుని చంపారని అనుమానాలు ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని పలమనేరు సీఐ పరిశీలించారు.

## జగన్ తిరుమల పర్యటన వేళ.. డిక్లరేషన్‌పై చంద్రబాబు స్వీట్ రిక్వెస్ట్



వైఎస్ జగన్ తిరుమల పర్యటన నేపథ్యంలో డిక్లరేషన్ అంశం వివాదాస్పదంగా మారింది. అన్య మతస్థులు తిరుమలకు అడుగుపెట్టినప్పుడు డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని టీటీడీ సహా కూటమి నేతలు, హిందూ సంఘాలు డిమాండ్ చేస్తుంటే.. వైసీపీ నేతలు మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో జగన్ డిక్లరేషన్ ఇస్తారా? ఇవ్వరా? అనేది సందిగ్ధంగా మారింది. ఇలాంటి సమయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇంట్రెస్టింగ్ ట్వీట్ (ఎక్స్) చేశారు.కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్ల మంది హిందువుల అతిపెద్ద పుణ్యక్షేత్రమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ దివ్యక్షేత్రం మన రాష్ట్రంలో ఉండటం మన అందరి అదృష్టమని తెలిపారు. ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు, భక్తుల మనోభావాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. తిరుమల దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు అత్యంత నియమ నిష్ఠలతో, శ్రద్ధాసక్తులతో స్వామివారిని కొలుస్తారని చెప్పారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఆలయ నియమాలను, ఆగమశాస్త్ర ఆచారాలను, టీటీడీ నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. భక్తుల మనోభావాలకు, ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు

## దసరా తరువాత ఏపీకి కుంకి ఏనుగులు : పవన్ కల్యాణ్



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల బీభత్సవాన్ని అరికట్టేందుకు దసరా తరువాత 8 కుంకి ఏనుగులు పంపేందుకు కర్ణాటక అంగీకరించిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ మధ్య ఎంఓయూ (ఒప్పందం జరిగిందని వివరించారు. ఇటీవల కర్ణాటక వెళ్లి కుంకీ ఏనుగుల అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రి, అటవీ శాఖ అధికారులతో చర్చించామని తెలిపారు.దేశంలో ఎక్కడా జరుగని విధంగా అటవీశాఖపై ఇరు రాష్ట్రాలు ఒప్పందాలు చేసుకున్న దాఖలాలు లేవని వెల్లడించారు. ఆరు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటుకు నిర్ణయించామని, మావటి, కావటిలకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి వారిలో సామర్థ్యాన్ని పెంచనున్నామని వివరించారు.ఏపీలో ఏనుగుల సంరక్షణ, వాటి ఆహారం తదితర అంశాలపై ఒప్పందం చేసుకున్నామన్నారు. ఏపీలోని శ్రీకాకుళం, మన్యం, చిత్తూరు జిల్లాలో అధికంగా ఏనుగులు దాడులు చేస్తూ మనుషుల ప్రాణనష్టం, పంట నష్టం జరుగుతుందని వెల్లడించారు. కుంకీ ఏనుగుల వల్ల ఏనుగుల దాడులను అరికట్టే అవకాశం ఉందని అన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను ఏపీ, కర్ణాటక సంయుక్తంగా అరికట్టేందుకు ఒప్పందం చేసుకున్నామని వివరించారు.

## మోదీతో ఎంకే స్టాలిన్ 45 నిమిషాలు భేటీ



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని డీఎంకే అధ్యక్షుడు, తమళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారంనాడు ఢిల్లీలో కలుసుకున్నారు. 'సమగ్ర శిక్షా స్కీమ్' కింద కేంద్ర నిధులు విడుదల చేయాలని, 50:50 ఈక్విటీ షేర్ కింద చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్-2కు అనుమతి ఇవ్వాలని ప్రధానిని ఆయన కోరారు. భారత మత్స్యకారులకు సంప్రదాయంగా ఉన్న చేపటవేట హక్కులను పరిరక్షించాలని, సముద్ర జలాల్లో పట్టుకున్న తమిళ మత్స్యకారులు, వారి పడవలను త్వరితగతిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రధానికి స్టాలిన్ అందజేశారు. సుమారు 45 నిమిషాల పాటు ఉభయులూ భేటీ అయ్యారు.ప్రధానితో భేటీ అనంతరం మీడియాతో స్టాలిన్ మాట్లాడుతూ, సహజంగా ఇలాంటి సమావేశాలకు 15 నిమిషాలు సమయం ఇస్తారని, అయితే ఈసారి ఉభయులూ 45 నిమిషాల పాటు మాట్లాడుకున్నామని చెప్పారు. ఒక ముఖ్యమంత్రిగా తాను ఆయనను కలుసుకున్నానని, ప్రధానిగా ఆయన తమ వినతులను ఆలకించారని చెప్పారు. ప్రధానంగా ప్రధానికి మూడు వినతలు చేసినట్టు చెప్పారు.

## వైసీపీ హయాంలో అవినీతి పెరిగి రాష్ట్రం నష్టపోయింది : పురందేశ్వరి



అమరావతి : ఐదేండ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి పెరిగి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు పురంధేశ్వరి ఆరోపించారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే నాడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం విజయవాడలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ వల్ల నిలిచిపోయిన పోలవరాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పోలవరానికి కేంద్రం రూ. 12 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. అమరావతి నిర్మాణానికి ఇప్పటి వరకు కేంద్రం 15 వేల కోట్లు ఇవ్వనుందని తెలిపారు. అమరావతి అభివద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాటలోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వాస్తవానికి విశాఖ స్టీల్ నిర్వహణను ఎవరూ గుర్తించడం లేదని అన్నారు.

## నా మతం మానవత్వం.. డిక్లరేషన్‌లో రాసుకోండి : వైఎస్ జగన్

అమరావతి : తిరుమల పర్యటనను మతం పేరుతో అడ్డుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్రంగా స్పందించారు. తన తండ్రి వైఎస్సార్ అనేక సార్లు తిరుమలను దర్శించుకున్నారు. నేను సీఎంగా 5సార్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించా. నా మతమేందో ప్రజలందరికీ తెలుసని అన్నారు. తిరుమల పర్యటన సందర్భంగా నెలకొన్న పరిస్థితులపై తాడేపల్లి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు.తాను నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతా తప్పేముంది. బయటకు పోతే హిందూత్వాన్ని, ముస్లిం, సిక్కు మతాలను గౌరవిస్తా.. అనుసరిస్తానని వెల్లడించారు. తిరుమలకు వస్తానంటే డిక్లరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేయడం శోచనీయమని ఆరోపించారు. ' నా మతం మానవత్వం. డిక్లరేషన్‌లో రాసుకుంటే రాసుకోండని' వెల్లడించారు. . దేవుడిని దర్శించుకోవడానికి ఐదేళ్లపాటు సీఎంగా పనిచేసినా వ్యక్తి పరిస్థితి ఇలా ఉంటే దళితుల పరిస్థితి ఏమిటని, వారిని రాబోయే రోజుల్లో గుడిలోకి రానిస్తారా. అంటూ అనుమానం వ్యక్తం చేశారు.తాను అధికారంలోకి రాకముందు చంద్రబాబు హయాంలోనే చేపట్టిన పాదయాత్ర తిరుమల నుంచే మొదలు పెట్టి, తిరుమలలోనే కాలినడకన స్వామివారిని దర్శించుకున్నానని



వెల్లడించారు. అప్పుడు లేని మతం డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం హిందూ ధర్మాన్ని వాడుకోవడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబుకు సబబేనా అంటూ నిలదీశారుమతాలను రాజకీయం కోసం వాడుకోవడం దౌర్భాగ్యమని అన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన చంద్రబాబును ఎందుకు మందలించడం లేదని బీజేపీ అగ్రనాయకత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన పాపాన్ని రాష్ట్ర ప్రజల మీద పడకుండా ఉండేందుకు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో గుడిల్లో పూజలు చేయాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## జాతీయ ఆహార మాసోత్సవాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27-మాతా శిశు సంరక్షణ కోసం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో పోషణ్ అభియాన్ మాసోత్సవాలు నిర్వహిస్తామని ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జాతీయ పోషణ్ మాసోత్సవాలలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజువారి ఆహారంలో సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు శారీరక, మానసిక ఎదుగుదల కొరకు మంచి పౌష్టిక ఆహారాన్ని సేవించాలన్నారు. సమాజంలో గౌరవించబడాలంటే ఐదు 'వ' కారాల తో కూడిన ప్రవర్తన ఉండాలని కలెక్టర్ సూచించారు. వస్త్రేనా వపుషా వాచా విద్య యా వినయైన చ వ కారైహి పంచ బి ర్యుక్తః న రో భవతి పండితః అనగా ఒక వ్యక్తి వస్త్రధారణ ఇతరులకు ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు, సానుకూల ఆలోచనలు, అర్ధవంతంగా నేర్చుకున్న విద్య, వినయ విధేయతలతో కూడిన సత్రప్రవర్తన కలిగి ఉండి మంచి ఆహారం తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యం కలిగి వుండి అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పోషకాహార లోపాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం పోషకాహార స్టాళ్లను సందర్శించి వివిధ రకాలైన చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. పోషకాహారాలతో కూడిన పదార్థాలు తీసుకోవడం వల్ల రక్త నివారణ, దృఢత్వం కలిగి ఉంటారని ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి, సిడిపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## అనురాధ కుటుంబాన్ని పరామర్శించిన డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ..





విభారె న్యూస్ సెప్టెంబర్ 27 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు నగరం నందలి ధర్మపేటలో ఇటీవల హత్యకు గురైన యువతి అనురాధ కుటుంబాన్ని శుక్రవారం ఉదయం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ హత్య వెనకాల ఎవరున్నారు అనే విషయం పోలీసు ఉన్నత అధికారులు విచారణ జరిపి దోషులను శిక్షించాలని బాధిత కుటుంబానికి అండగా ఉండాలని అనురాధ కుటుంబానికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం ప్రభుత్వం నుండి రావాల్సిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రెండెకరాల వ్యవసాయ భూమి, ఆర్థిక సహాయం పది లక్షల రూపాయలు తక్షణమే కలెక్టర్ బాధితులకు ఇప్పించి అండగా నిలబడాలని పి మురళీకృష్ణ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతరత్నం, ఎండ్లూరి లాజరస్, ఐ ఎన్ టి యు సి ఎన్ సుంకన్న ఆర్ ప్రతాప్ కాంగ్రెస్ మహిళా నాయకులు ఎస్ ప్రమీల,ఏ వెంకట సుజాత,కరుణమ్మ,జాన్ సదానందం,మాలిక్ భాష తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

శనివారం 28-09-2024

## దశాబ్దంలో ఎంతో మార్పు...

### ఫలితాలు ఇస్తున్న మేక్ ఇన్ ఇండియా

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మేక్ ఇన్ ఇండియా క్యాంపెయిన్' 10 ఏళ్లు పూర్తి చేసుకుంది.సాధ్యమైనన్ని రకాలుగా 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. సంస్కరణల మార్గంలో భారతదేశం పురోగతిలో సాగిపోతూనే ఉంటుంది. మనమందరం కలిసికట్టుగా స్వయంసమృద్ధి ('ఆత్మనిర్భర్ భారత్') దిశగా, అభివృద్ధి చెందినటువంటి భారతదేశాన్ని ('వికసిత్ భారత్'ను) ఆవిష్కరించుదామని ప్రధాని పిలుపు ఇచ్చారు. మేక్ ఇన్ ఇండియా ఇతర ప్రధాన విజయాలు 2023-24లో రూ. 1.55 లక్షల కోట్ల విలువైన ఖాదీ విక్రయాలు పీఎల్ఐ పథకం కింద రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది 8.5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది. 4 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు పెరిగాయి. 2020లో టాయ్‌ల కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసినప్పటి నుంచి ఎగుమతులు 239 శాతం పెరిగాయి. గడచిన దశాబ్ద కాలంగా దీక్ష విజయవంతం కావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారికి ప్రధాన మంత్రి తన కృతజ్ఞతలు తెలిపారు.భారత్ మారుతోంది. ఒప్పుడు ఎన్నో దిగుమతులు.. ఇప్పుడు అన్నీ ఉత్పత్తులే. మేకిన్ ఇండియా నినాదం క్రమంగా ప్రతిఫలాలను ఇస్తోంది. ప్రధాని మోదీ కలలు సాకారమవుతుండడంతో పాటు.. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. 2014లో ప్రతిష్టాత్మకంగా మేకిన్ ఇండియాను లాంచ్ చేశారు మోదీ. భారత్‌ను ప్రపంచంలో టాప్ ఉత్పత్తి దేశంగా మార్చేందుకు కలలు కన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు దాని ప్రతిఫలాలను దేశం చూస్తోంది. 2014లో దేశంలో 80శాతం మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉంటే.. ఇప్పుడు 99.9శాతం మొబైల్స్ ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. అంతేకాదు.. యూకే, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, ఇటలీ, సౌతాఫ్రికా వంటి దేశాలకు ఎగుమతులు కూడా సాగుతున్నాయి. డిఫెన్స్ ప్రొడక్షన్‌తోపాటు.. అంతరిక్షం, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్ల తయారీ, నిర్మాణ రంగం, రైల్వే ఇన్‌ఫ్రాలోనూ అద్భుత ఫలితాలను సాధిస్తోంది.10 సంవత్సరాల క్రితం సెప్టెంబరు 25, 2014న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ చొరవ, తయారీపై భారతదేశం పునరుద్ధరణ దృష్టిని లక్ష్యంగా చేసుకుంది. భారతదేశాన్ని అత్యంత ఇష్టపడే ప్రపంచ తయారీ కేంద్రంగా ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశ్యం. పెట్టుబడులను ఆకర్షించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం ద్వారా భారతదేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ రంగాలలో ఎగుమతులను పెంచడంలో సహాయపడింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. ప్రపంచ వేదికపై భారతీయ వ్యాపారాలు తమ సామర్థ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను సృష్టించింది. 'మేక్ ఇన్ ఇండియా' వెనుక ఉన్న విశాల దృక్పథాన్ని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.ఆత్మనిర్భర్ భారత ని నిర్మించాలనే తన ప్రభుత్వ లక్ష్యంతో ఎలా సక్సెస్ అయ్యిందో పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా క్యాంపెయిన్‌తో ఈ 10 సంవత్సరాలలో భారతదేశం ఎంత మారిపోయింది. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధిగల దేశంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మోదీ హామీ ఇచ్చారు. సంస్కరణలలో భారతదేశం పురోగతి కొనసాగుతుంది. మనం కలిసి ఆత్మనిర్భర్ విక్షిత్ భారత్‌ను నిర్మిస్తామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.మేక్ ఇన్ ఇండియా ప్రచారం వివిధ రంగాలలో ఎగుమతులను ఎలా పెంచింది. సామర్థ్యాలను సృష్టించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది.దేశంలో స్టార్టప్‌ల సంఖ్య 2014లో 350 ఉండగా, 10 ఏళ్లలో స్టార్టప్ ఇండియా ప్రోగ్రామ్ కింద నమోదైన వాటి సంఖ్య 1.48 లక్షలకు పెరిగింది. టైర్ ఐఐ , టైర్ ఐఐఐ నగరాల నుండి వచ్చే స్టార్టప్‌లలో 45 శాతం వాటాను 2014 నుండి మంజూరు చేసిన 1 కోటి పేటెంట్లపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. దేశంలో స్టార్టప్ ప్రారంభించిన ప్రతి గంటకు 15 లక్షల ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. ఎంఎస్ఎంఈ లకు సంబంధించి, ఉద్యమ్ పోర్టల్‌లో 1.85 కోట్ల మహిళా యాజమాన్యంలోని ఎంటర్‌ప్రైజెస్‌తో సహా 4.91 కోట్లకు పైగా నమోదిత ఎంఎస్ఎంఈ లు కొనసాగుతున్నాయి. నమోదిత యూనిట్లు 21.17 కోట్ల ఉద్యోగాలను సృష్టించాయి. 2022-23లో భారతదేశ జీడీపీ కి 30.1 శాతం అందించాయి.బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, కొత్త విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు, రోడ్డు, రైలు నెట్‌వర్క్‌ల విస్తరణతో సహా అనేక పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మేక్ ఇన్ ఇండియాతో ప్రారంభమైనవే.. ఇది లాజిస్టిక్స్ సమస్యలను పరిష్కరించడమే కాకుండా పారిశ్రామిక యూనిట్లకు మద్దతునిచ్చింది.మేక్ ఇన్ ఇండియాతో, డిజిటలైజేషన్, సాంకేతిక పురోగతి అనేక రంగాలలో కూడా కనిపించింది. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో స్వావలంబన పెరిగింది. మొబైల్ తయారీలో భారతదేశం అగ్ర దేశంగా మారింది. ఆపిల్, శాంసంగ్ సహా అనేక ఇతర ప్రపంచ కంపెనీలు భారతదేశంలో మొబైల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. 2014లో, భారతదేశంలో కేవలం 2 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసేవి. ఇది 2020 నాటికి 200 కంటే ఎక్కువ యూనిట్లకు పెరిగింది.మేక్ ఇన్ ఇండియా రక్షణ రంగంలో స్వావలంబనను ప్రోత్సహించింది. పెద్ద ఎత్తున సహకరిస్తున్నాయి. రక్షణ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రభుత్వం 74 శాతానికి పెంచింది. తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' సహా అనేక స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తి ఈ చొరవలో ముఖ్యమైన భాగం

## రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి కి ఘన స్వాగతం...

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు కష్టం వస్తే అండగా నిలుస్తా....సుబ్బారెడ్డి**





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 27 ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులై డోన్ కు శుక్రవారం మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా డోన్ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. నందమూరి తారక రామారావు గారి విగ్రహము నుండి పాత బస్టాండ్ మీదుగా ఇంటికి చేరుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి నందమూరి తారక రామారావు విగ్రహమునకు, పొట్టి శ్రీరాములు విగ్రహమునకు, కోట్ల విజయభాస్కరరెడ్డి విగ్రహమునకు,శ్రీ కృష్ణదేవరాయల విగ్రహమునకు, కె.యి.మాదన్న విగ్రహమునకు, వాల్మీకి మహర్షి విగ్రహమునకు, గాంధీ విగ్రహమునకు, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహమునకు పూలమాలతో నివాళులు అర్పించారు అనంతరం ఇంటికి చేరుకున్న ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి కి కుటుంబ సభ్యులు సాంప్రదాయంగా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ మీటింగ్ లో ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూనేను ఒక రైతు బిడ్డ గా నాకు లభించిన హోదా గత 3సంవత్సరాలుగా నా వెన్నంటి ఉన్నా తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు వలనే వచ్చిందని నేను ఎంతో గర్వపడుతున్నాని అన్నారు. నన్ను ఎన్డీఏ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, మంత్రులకు కృతజ్ఞతలు, సహాయ సహకారాలు అందిన నంద్యాల జిల్లాలోని ఎమ్మెల్యేలకు, ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నేను రాష్ట్ర అభివృద్ధి కొరకు, డోన్ నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ బలోపేతానికి కృషి చేస్తూ , టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, ధర్మవరం మన్నే చిన్న నాగిరెడ్డి, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి , డోన్ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ ఆలా మల్లిఖార్జున రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ అడ్వసర్ మధుసుదన్ గౌడ్ , యువ నాయకులు ధర్మవరం మన్నే భరత్ రెడ్డి , బేతంచేర్ల పట్టణ టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నాం చంద్రశేఖర్ , బేతంచేర్ల పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి , సర్పంచ్ రామిరెడ్డి, జిల్లా బిసి కమిటీ నాయకులు జయ్యన్న , డోన్ మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు, బుగ్గనపల్లె రమేష్ బేతంచేర్ల కౌన్సులర్ లు, డోన్ పట్టణ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు చక్రపాణి గౌడ్, నంద్యాల జిల్లా తెలుగుయువత నాయకులు బోరెడ్డి అభిలాష్ రెడ్డి , డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సిటి కేబుల్ కిరణ్ ,కాంత్ బ్రదర్స్ , డోన్ మండలం తెలుగుయువత అధ్యక్షులు కోనేటి కాశీ విశ్వనాథ్, మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్) పై సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్



విభారె న్యూస్ సెప్టెంబర్ 27 కర్నూలు జిల్లా ప్రతినిధి..మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై పాఠశాల,కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన తప్పనిసరి.అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి.తనిఖీలు నిర్వహించాలి.జిల్లాలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ తెలిపారు.ఈ సంధర్భంగా శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్) పై కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాల, కళాశాలల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రైల్వే స్టేషన్లు,ఆర్టీసీ బస్టాండ్లలో,పంట పొలాల్లో,గ్రామీణ అటవీ ప్రాంతాల్లో కూడా అన్ని శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు.అన్ని విద్యా కేంద్రాల్లోనూ, సంక్షేమ హాస్టల్లోనూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కల్పించాలన్నారు.మాదక ద్రవ్యాల ఉత్పత్తి కానీ,వాడకం కానీ జరిగినట్లు తెలిస్తే డయల్ 100 కి ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పోలీసులకు, సంబంధిత శాఖల వారికి సమాచారం అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల ను కొనడం,అమ్మకం చేస్తూ, అక్రమ రవాణా కు పాల్పడే వారి పై పోలీసు నిఘా పెంచామన్నారు.మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం చాలా అవసరమన్నారు.మాదక ద్రవ్యాల బారిన పడి కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువత కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు,డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ శాంతకుమారి,జాయింట్ డెరెక్టర్ అగ్రికల్చర్ వరలక్ష్మీ, ఫారెస్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ విజయ్ కుమార్,మెడికల్ హెల్త్ ఆఫీసర్ నాగప్రసాద్, జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్, ఆర్ టి సి డిపో మేనేజర్ ఇంచార్చ్ సుధారాణి ,డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి,జిఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కైకా, గవర్నమెంట్ హాస్పిటల్ ఆర్ ఎమ్ ఓ కిరణ్ కుమార్,డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అకస్మికంగా ఎరువుల తనిఖీ



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27 - . శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నంద్యాలలోని ఎరువుల తనిఖీని స్థానిక రైల్వే స్టేషన్లో వచ్చినటువంటి ఎరువులను పరిశీలించారు. గ్రీన్ స్టార్ కు సంబంధించి పిక్ కంపెనీకి సంబంధించి యూరియా డిఏపి మరియు 20 20 13 ఎరువులు మరియు కోరమండల్ కు సంబంధించినటువంటి 13 ఎరువులు 20 20 13 ఎరువులు మరియు 28 28 ఎరువుల యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఈ యొక్క ఎరువుల సరఫరా ఏపీ మార్ఫెడుకు 50 శాతం కేటాయించాలని మరియు ప్రైవేట్ డీలర్లకు కేటాయించిన ఎరువుల సరఫరాను కంపెనీలు మరియు వ్యవసాయ అధికారులు సరిగా సరఫరా అవుతున్నాయా లేదా మరియు అధిక ధరలకు అమ్మకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డిబిటిలో ఎరువుల యొక్క అమ్మకాలను తప్పనిసరిగా రైతులకే అమ్మ వలసిందిగా తెలియజేశారు. కంపెనీ యొక్క అధికారులు ఎరువులను మండలాల్లో ఉన్నటువంటి అవసరమ దృష్టిలో పెట్టుకొని ఈ యొక్క ఎరువుల సరఫరాను సరైన పద్ధతిలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మరియు నంద్యాల వ్యవసాయ అధికారి ప్రసాద రావు. సాంకేతిక అధికారి కళ్యాణ్ కుమార్. స్పిక్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీకి ఘన సన్మానం...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 27 శుక్రవారం గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులను అధ్యక్షులు కేవీ ఫణి రాజ్ , కార్యనిర్వహణ అధ్యక్షులు ఎస్ వి రమణ, ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ జిల్లా మెంబర్ కె వి హరికిషన్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నెంబర్లు బచ్చు చక్రి, రామ రమేష్, ఉష లను డోన్ టౌన్ సిఐ శ్రీ ఇంతియాజ్ భాష , ఎస్ ఐ శరత్ , నరేంద్ర , ప్యాపిలి ఎస్ఐ , సాదరంగా ఆహ్వానించి కమిటీ సభ్యులఅందరు ఇదివరలో జరిగిన వినాయక చవితి పండగ మరియు నిమర్జనం చాలా బాగా నిర్వించారని కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించడం జరిగింది. సీఐ ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు. ఈ సమావేశంలో సభ్యులందరూ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

# సొంత పార్టీ నేతలే టార్గెట్ చేస్తున్నారా...

తిరుపతి, సెప్టెంబర్ 27, వైసిపి ఆత్మ రక్షణలో పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. వైసిపి హయాంలో వైఫల్యాలు బయటకు వస్తున్నాయి.అదే సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లే నేతల సంఖ్య పెరుగుతోంది. ఒక విధంగా ఇది సంక్లిష్ట పరిస్థితి.అందుకే వ్యూహకర్తలు రంగంలోకి దిగారు. వైసిపి నాయకులతో ప్రెస్ మీట్ లు పెట్టిస్తున్నారు. తాజాగా కొడాలి నాని, వల్లభనేని వంశీ వైసీపీ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. కానీ వల్లభనేని వంశీ ఒక్క మాట అనకుండా సైలెంట్ గా ఉన్నారు. అదే సమయంలో కొడాలి నాని సైతం గతానికి భిన్నంగా మాట్లాడారు. ఎక్కడా మాటల్లో మునుపటి దూకుడు తనం ప్రదర్శించలేదు.బూతులు మాట్లాడలేదు. టీటీడీ లడ్డు వ్యవహారంలో వైసిపి తప్పు లేదని మాత్రమే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో చంద్రబాబుపై సునిశిత విమర్శలు చేశారు. ఆయన మాట్లాడుతున్నంత సేపు వల్లభనేని వంశీ దిగాలుగా కనిపించారు. అయితే అది వ్యూహకర్తల పనేనని ప్రచారం సాగుతోంది.సరిగ్గా ఇదే సమయంలో శ్రీకాకుళంలో మాజీ స్పీకర్ తమ్మినేని సైతం మీడియాతో మాట్లాడారు.గతంలో రాజ్యాంగబద్ధ పదవిలో ఉండేటప్పుడు అడ్డగోలుగా మాట్లాడిన తమ్మినేని.. ఇప్పుడు వైసీపీ నేతగా ఒక పద్ధతి ప్రకారం మాట్లాడారు.అయితే వైసిపి ఆత్మ రక్షణలో పడడం వల్లే దాక్కున్న నేతలంతా బయటకు వచ్చారని ప్రచారం ప్రారంభమైంది.ప్రస్తుతం ఏపీలో తిరుమలలో వ్యవహారం హాట్ టాపిక్ అవుతోంది. ఈ విషయంలో వైసీపీని కార్నర్ చేసింది టిడిపి కూటమి ప్రభుత్వం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ముప్పేట దాడి చేస్తున్నారు.గత వంద రోజులు మాట్లాడని వారు మీడియా ముందుకు వచ్చారు. టిడిపి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసమే చంద్రబాబు ఈ తరహా ప్రచారానికి తెర తీసారనిజగన్ ఆరోపించారు. సిబిఐతో పాటు సింగిల్ జడ్జి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టిటిడి చైర్మన్లుగా పనిచేసిన వై వి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డిలు ఖండించారు. అది తప్పుడు ప్రచారం గా పేర్కొన్నారు. తాజాగా మాజీ మంత్రులు కొడాలి నాని, తమ్మినేని సీతారాం ఈ వివాదం పై మాట్లాడారు. కొడాలి నాని కాస్త కూల్ గా వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుపై తేలికపాటి విమర్శలకు మాత్రమే పరిమితం అయ్యారు. అయితే స్పీకర్ గా పనిచేసిన సీనియర్ నేత తమ్మినేని సీతారాం చేసిన వ్యాఖ్యలు మాత్రం అభ్యంతరకరంగా ఉన్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.తిరుపతి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందన్నది ప్రధాన ఆరోపణ. అందులో జంతు కొవ్వు కలిసిందన్నది ఓ నిర్ధారణలో తేలినట్లు టిడిపి నేతలు చెబుతున్నారు. అయితే ఈ తప్పును తమ్మినేని ఒప్పుకున్నట్లు ప్రకటన చేశారు. తప్పు టిటిడిది కాదు.. ఆవుది

### నిన్న రోజా... ఇవాళ తమ్మినేని

అంటూ అర్థం వచ్చేలా మాట్లాడారు. సాధారణంగా ఆవాలు, పామాయిల్ తినే ఆవులు ఇచ్చే పాలలో కల్తీ అవుతుందని.. అలా నెయ్యిలో కల్తీ జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ తమ్మినేని చేసిన ప్రకటన వైసీపీకి మరో డ్యామేజ్ చేసే అవకాశం కనిపిస్తోంది.అయితే ఇది ఉద్దేశపూర్వకంగా, రాజకీయ పగతో చేసిన పని అని ఇప్పటివరకు వైసీపీ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. కానీ తమ్మినేని మాత్రం ఏకంగా ఆవుపై నెపం మోపడం హాట్ టాపిక్ అవుతోంది. అసలు ఆయన మట్టిలో ఉండే మాట్లాడుతున్నారా? అని నెటిజన్లు ప్రశ్నించే దాకా పరిస్థితి వచ్చింది. అంటే తమ్మినేని కల్తీ జరిగిందని ఒప్పుకున్నట్టేనా? నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందా? అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యపై మాట్లాడిస్తే తమ్మినేని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సొంత పార్టీలోనే తమ్మినేని కామెంట్స్ చర్చకు దారితీస్తున్నాయి.ఈ వివాదం కోట్లాదిమంది హిందువుల మనోభావాలకు సంబంధించిన అంశం. చాలా జాగ్రత్తగా మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఈ వివాదములో వైసీపీకి భారీ డ్యామేజ్ జరిగింది. దాని నుంచి బయటపడేందుకు ఆ పార్టీ ఆపసోపాలు పడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎంతో జాగ్రత్తగా మాట్లాడాలి. కానీ ఒక సీనియర్ నేతగా ఉన్న తమ్మినేని.. ఒక్కసారిగా అలా మాట్లాడేసరికి ఈ వివాదం యూటర్న్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ఇక రోజా...వైసీపీ ఫైర్ బ్రాండ్లలో మాజీ మంత్రి రోజా ఒకరు. గత ఐదేళ్లుగా ప్రత్యర్థులపై టార్గెట్ చేయడంలో ఆమె తీరే వేరు. 2014లో తొలిసారిగా ఆమె నగిరి ఎమ్మెల్యేగా గెలిచారు. జగన్ వైసీపీ ఏర్పాటుకు ఆ పార్టీలో చేరి.. ఎమ్మెల్యేగా విజయం సాధించాలన్న తన కలను సాకారం చేసుకున్నారు.అయితే ఐదేళ్ల పాటు వైసీపీ విపక్షంలో ఉండిపోయింది. ఆ సమయంలో ఎంతో దూకుడు కనబరిచారు రోజా. జగన్ టీమ్ లో ముఖ్య నేతగా మారిపోయారు. నాడు అధికారపక్షం పై విరుచుకుపడే తీరు ఆకట్టుకుంది.అదే ఆమెను అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ వేటుకు కారణమైంది.అయితే రోజా మాత్రం దూకుడు తగ్గించలేదు. అదే స్పీడ్ తో 2019 ఎన్నికల్లో నగిరి నుంచి రెండోసారి గెలిచారు. అక్కడి నుంచి రోజా వెను తిరిగి చూడలేదు. తొలి మంత్రివర్గంలో ఆమెకు చోటు దక్కలేదు. కానీ విస్తరణలో మాత్రం ఛాన్స్ ఇచ్చారు జగన్. అక్కడి నుంచి ప్రత్యర్థులపై విరుచుకుపడేవారు. ఆపై వివాదాస్పదం అయ్యారు. బూతు నేతల సరసన చేరిపోయారు. అదే ఆమెకు ఇబ్బందిగా మారింది. వైసిపి దారుణంగా ఓడిపోయింది. రోజా నగిరి నుంచి భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు. దీంతో కొద్ది రోజులు పాటు రాజకీయంగా సైలెంట్ అయ్యారు. స్థానికంగా కూడా కనిపించకుండా పోయారుతాజాగా తిరుమల లడ్డు వివాదం నేపథ్యంలో తెరపైకి వచ్చారు రోజా. ఈ విషయంలో సీఎం చంద్రబాబును టార్గెట్ చేసుకున్నారు. అసలు వైసీపీ ది తప్పు కాదన్నట్టు చెప్పుకొచ్చారు. తమ పార్టీని వెనుకేసుకొచ్చారు. అయితే పదుల సంఖ్యలో అనుచరులను వెంటేసుకుని పరచు తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలకు వెళ్లడం ద్వారా రోజా తీవ్ర వ్యతిరేకతను తెచ్చుకున్నారు. బ్రేక్ దర్శనాలతో ఆమె డబ్బులు దండుకున్నారని ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తిరుమల లడ్డు వివాదం పై మాట్లాడడం జనాల్లో ఆగ్రహానికి కారణం అవుతోంది. ఈ విషయంలో ఆమె మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుకామెంట్స్ వినిపిస్తున్నాయి.రోజా తనకు తాను అతిగా ఊహించుకున్నారు. లడ్డు వివాదం నేపథ్యంలో ఒక అడుగు ముందుకు వేశారు. తిరుమల ఎవరి హయాంలో మెరుగ్గా ఉందని.. లడ్డు విషయంలో ఎవరిది తప్పు అంటూ ఆమె తన యూట్యూబ్ ఛానల్ లో పోల్స్ పెట్టారు. మెజారిటీ జనాలు చంద్రబాబుకు జై కొట్టారు. కనీస స్థాయిలో కూడా జగన్ ను సమర్ధించలేదు. ఈ పోల్ రిజల్ట్స్ కు సంబంధించి స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ దెబ్బతో రోజా యూట్యూబ్ ఛానల్ ని మూసివేశారు. ఆపై మాట మార్చారు.

## పిన్నెల్లి.. పెద్ద దిక్కా...

గుంటూరు, సెప్టెంబర్ 27, పల్నాడు జిల్లాలో వైసీపీ ఖాతా తెరవలేకపోయింది. అంతకు ముందు ఎన్నికల్లో టీడీపీకి జిల్లాలో స్థానం లేకుండా వైసీపీ మొన్నటి ఎన్నికల్లో పూర్తిగా కనుమరుగైంది. దాంతో సంస్థాగతంగా పార్టీలో మార్పులు చేర్పులు ఉంటాయని అందరూ భావించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడి పదవి ఒక సీనియర్ నేతకి అవకాశం ఇవ్వబోతున్నారని గట్టి ప్రచారమే జరిగింది. కానీ అధిష్టానం మాత్రం తన ఓటుని మళ్లీ పాత కాపుకే వేసింది. తిరిగి పిన్నెల్లికే పల్నాడు పార్టీ పగ్గాలు అప్పజెప్పడం వెనుక జగన్ వ్యూహమేంటి?పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా మరోసారి మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఎన్నికల సమయంలో ఈవీఎం ధ్వంసం సహా వివిధ కేసులు నమోదయ్యాయి. దాంతో పరారైన పిన్నెల్లి చివరకు పోలీసులకు దొరికి నెల్లూరు జిల్లా రిమాండ్ అనుభవించి షరతులతో కూడిన బెయిల్‌పై బయటకు వచ్చారు.జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మాచర్ల రావడానికి కొన్ని కండిషన్స్ ఉండటంతో ప్రస్తుతం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గానికి దూరంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కాకుండా మరో నేతికి వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా అవకాశం లభిస్తుందని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి పార్టీ అధ్యక్షుడి పదవి ఇచ్చినా.. స్వేచ్ఛగా తిరుగుతూ పార్టీ కార్యక్రమాలు యాక్టివ్‌గా నిర్వహించే పరిస్థితి లేదు.అందుకే పిన్నెల్లి స్థానంలో కొత్త నేతకి పగ్గాలు అప్పగిస్తారని వైసీపీ వర్గాలు భావించాయి. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైల్లో ఉన్న సమయంలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం నేతల మధ్య కూడా పోటీ నడిచింది. రేసులో గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాసు మహేష్‌రెడ్డి , మోదుగుల వేణుగోపాల్ రెడ్డిల పేర్లు ఫోకస్ అయ్యాయి. వైసీపీ అధిష్టానం వారి పేర్లు పరిశీలిస్తున్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరిగింది. అయితే కొందరు మాత్రం గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అవకాశం కల్పించ వద్దని అధిష్టానానికి విన్నపాలు కూడా చేశారంట.క్రమంలో మోదుగోలకు వేణుగోపాల్ రెడ్డికి అవకాశం లభిస్తుందని పార్టీలో సీనియర్లు సైతం భావంచారు. వేణుగోపాల్ రెడ్డికి అధ్యక్ష పదవితో పాటు మాచర్ల ఇన్చార్జి బాధ్యతలు కూడా ఇచ్చే అవకాశం ఉన్నట్లు చర్చ నడిచింది. దానికి కారణం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్లలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు లేకపోవడమే అని అదీకాక నియోజవర్గంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై వ్యతిరేకత విపరీతంగా పెరిగిపోయినట్లు టాక్ నడిచింది.అయితే జగన్ మాత్రం పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే మరోసారి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు .. దాని వెనుక అధిష్టానం ఆలోచన వేరే విధంగా ఉందంటున్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. అందుకే పిన్నెల్లి నెల్లూరు జైల్లో ఉన్నప్పుడు జగన్ బెంగళూరు నుంచి హుటాహుటిన వచ్చి ఆయన్ని పరామర్శించి వెళ్లారు. పిన్నెల్లి ఈవీఎంను పగలగొట్టడాన్ని సమర్ధించి పిన్నెల్లి మంచోడని కితాబు కూడా ఇచ్చారు.జగన్‌తో అంత సాన్నిహిత్యం ఉన్న పిన్నెల్లి ముందు నుంచి ఆయనతోనే ఉన్నారు ? జగన్ కోసం 2012లో కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలిచార. పాఅత్యధిక సార్లు పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడిగా కూడా పిన్నెల్లికి ముద్ర ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మార్చి మరొకరికి అవకాశం ఇస్తే ఓడిపోయారు కాబట్టి మార్పులు చేశారన్న ప్రచారంతో పార్టీ మరింత డ్యామేజ్ అవుతుందని జగన్ భావిస్తున్నారంట. అదీకాక పిన్నెల్లి కూడా జగన్‌ను అధ్యక్ష పదవిలో కొనసాగించమని వేడుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. లేకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ఆ ఫ్యాక్షన్ లీడర్ వార్నింగ్ కూడా ఇచ్చారంటున్నారు.పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కాకుండా మరో నేతకి అవకాశం ఇచ్చినా ప్రస్తుతానికైతే వైసీపీకి చేకూరే ప్రయోజనమేదీ లేదు. అందుకే కొంత కాలం కొద్ది రోజులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అధ్యక్షుడిగా కొనసాగించి తర్వాత పరిస్థితులను బట్టి మార్పులు చేర్పులు గురించి ఆలోచించ వచ్చని జగన్ లెక్కలు వేసుకుంటున్నట్లు చెప్తున్నారు. అదీకాక ఇప్పటికిప్పుడు పిన్నెల్లిని పక్కన పెడితే ఆయన పార్టీకి దూరమయ్యే అవకాశమందని.. ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్న నాయకుల్ని కూడా దూరం చేసుకుంటే కష్టమని జగన్ ఆయనకే అవకాశమిచ్చారని అంటున్నారు.

## ఇంకా చిక్కని చిరుత

రాజమండ్రి ,మూడు రోజులుగా తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ ప్రాంతంలో సంచరిస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి ఫారెస్ట్ అధికారులకు చిక్కుతుందా లేదా అనేది చర్చనీయంగా మారింది. తూర్పుగోదావరి,కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన సుమారు 60 మంది బృందం ఈ చిరుతను పట్టుకోవడానికి ముమ్మర చర్యలు చేపడుతున్నారు. అయితే గురువారం ఆ చిరుత కదలికలు ఉన్న కడియపులంక చెక్కపల్లి వారి వీధి సమీపంలో గల నర్సరీ వద్ద బోన్లు ఏర్పాటు చేసి దానికి ఆహారంగా మేక,పంది పిల్లలను ఉంచారు. గత మూడు రోజుల నుండి ఆ చిరుత ఆహారంగా ఏ జంతువును తిన్న ఆనవాళ్ళు కనబడలేదు. అందువల్ల ఆహారం కోసం ఈ బోనులోకి వచ్చి చిక్కుతుందనే అభిప్రాయంతో ఉన్నారు. ఇక్కడ నుండి తప్పించుకుంటే ఆ చిరుతను పట్టుకోవడం చాలా కష్టమవుతుంది.ఇప్పటికే దివానచెరువు, కడియం ప్రాంతలలో పాతిక రోజులుగా అధికారులు వేసిన ఎత్తుగడలను చిత్తు చేస్తూ తప్పించుకుని తిరుగుతుంది.

### తల్లిని గొంతు కోసి దారుణంగా చంపిన కొడుకు, కోడలు అరెస్ట్

అన్నమయ్య ,అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గం లోని ములకలచెరువులో ఈ నెల 22న ఆదివారం అర్ధ రాత్రి ఏ.సఫియా భేగం ను కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన కేసులో మృతురాలి కొడుకు చిన్నరెడ్డి బాషా, కోడలు ఆషియాను గురువారం రాత్రి అరెస్టుచేసినట్లు ములకళచెరువు సీఐ రాజారమేశ్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. మృతురాలు సఫియాబేగం తో ఆమె చిన్నకొడుకు, కోడలు ఆస్తికోసం గొడవపడి మిద్దిపైన నిద్రిస్తున్న సఫియా బేగంను పథకం ప్రకారం కత్తితో గొంతుకోసి దారుణంగా చంపినట్లు విచారణలో తేలిందంతో నిందితులను అరెస్టు చేశామన్నారు.

### దేవరదొడ్డి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల అనుమానాస్పద మృతి

చిత్తూరు బైరెడ్డిపల్లి మండలంలోని దేవదొడ్డి వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతుంది. శుక్రవారం ఉదయం వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు..చిత్తూరు జిల్లా, పలమనేరు నియోజకవర్గం లోని బైరెడ్డిపల్లి మండలం, దేవరదొడ్డి గ్రామం వద్ద గురువారం అర్ధ రాత్రి ఎన్ హెచ్ వర్క్ చేస్తున్న బయట రాష్ట్రాలకు చెందిన ఇద్దరిని కొట్టి చంపినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు మాట్లాడలేని కారణంగా దొంగలనుకుని చంపారని అనుమానాలు ఉన్నాయి.

## బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల

తిరుమల,కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన నేల తిరుమలలో బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల అయింది. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తుంది. అక్టోబర్ 4న ఉదయం 5:45 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు ప్రారంభమవుతాయి. రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 12న రాత్రి 10:30 గంటలకు ధ్వజారోహణంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.4న ధ్వజారోహణం, పాద సేవ వాహనం , 5న చిన్న శేష వాహనం, హంస వాహనం, 6న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 7న కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 8న మోహిని అవతార వాహనం, గరుడసేవ,9న హనుమంత వాహనం, “బంగారు రథం”, గజవాహనం, 10న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వ వాహనం, 12న చక్రస్నానం, ధ్వజరోహణం నిర్వహించనున్నారు.రాకపోకలపై నిషేధం..బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండపైకి వచ్చే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. అక్టోబర్ 7 రాత్రి 11 గంటల నుంచి అక్టోబర్ 8 అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం విధిస్తారు సందర్భంగా టీటీడీ.. ప్రత్యేక దర్శనాలు, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయనుంది

### జనసేనలో చేరికలపై వ్యూహాలు

విజయవాడ, సెప్టెంబర్ 27, జనసేనలో వరస చేరికలు పార్టీ నేతలను కూడా ఆలోచనలో పడేస్తున్నాయి. ఎందుకంటే పదేళ్ల నుంచి లేని చేరికలను పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడే ఎందుకు మొదలు పెట్టారన్నది గాజుగ్లాస్ పార్టీ ముఖ్యనేతలకు కూడా అర్ధం కాకుండా ఉంది. గత పదేళ్లలో పదుల సంఖ్యలోనే నేతలుండేవారు. బలమైన క్యాడర్‌తో పాటు కాపు సామాజికవర్గం, పవన్ ఫ్యాన్స్ కారణంగా నేతలు చేరకపోయినా 2024 ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ వచ్చింది. 21 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలనే ఎంచుకుని, అందులోనే పోటీ చేసి అన్నింటిలోనూ గెలిచి పవన్ కల్యాణ? పదేళ్ల నుంచి తనపై వస్తున్న విమర్శకుల నోళ్లను మూయించగలిగారు.కానీ అధికారంలోకి రాగానే టీడీపీ కంటే జనసేనలో చేరికలు ఎక్కువగా ఉండటం వెనక ఎవరున్నారన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. పవన్ కల్యాణ్ సొంత నిర్ణయం కాదన్నది ఎక్కువ మంది అభిప్రాయంగా వినిపిస్తుంది. ఎందుకంటే పవన్ పెద్దగా చేరికలను ప్రోత్సహించరని అందరికీ తెలిసిందే. ఎందుకంటే పవన్ కు నాయకులకంటే అభిమానులు, ఓటుబ్యాంకు పైనే నమ్మకం ఎక్కువ. అలాంటి పవన్ కల్యాణ గత కొద్ది రోజుల నుంచి చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనక బలమైన కారణం లేకపోలేదన్న కామెంట్స్ జనసేన నేతలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. దీనికి కారణం ఏమైనా నేతలు ఎక్కువయితే మిగిలిన పార్టీల మాదిరిగా జనసేన తయారవుతుందేమోనన్న ఆందోళన పార్టీ ముఖ్య నేతల్లో వ్యక్తమవుతుంది. ఇప్పటికే కొందరు నేతల చేరికకు పవన్ కల్యాణ్ ఓకే చెప్పారు. ఈ నెల 26వ తేదీన ముగ్గురు వైసీపీ నేతలను జనసేనలోకి చేర్చుకున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన కిలారు రోశయ్య, కృష్ణా జిల్లాకు చెందిన సామినేని ఉదయభాను, ప్రకాశం జిల్లాకు చెందిన బాలినేని శ్రీనివాసులురెడ్డిలు పార్టీలో చేరుతున్నారు. వీరంతా చేరితే ఆ నియోజకవర్గాల్లో టీడీపీ నేతలకు కొంత ఇబ్బందులు ఎదురవుతాయి. అయినా కూడా మిత్రపక్షమైన టీడీపీని కాదని పవన్ ఎందుకు పార్టీలో చేర్చుకుంటున్నారన్నది ప్రశ్న. ఎందుకంటే ఆ నియోజకవర్గాల్లో పొన్నూరులో ధూళిపాళ్ల నరేంద్ర, ఒంగోలులో దామచర్ల జనార్ధన్ రావు, జగ్గయ్యపేటలో శ్రీరామ్ తాతయ్యలు ముగ్గురూ టీడీపీకి చెందిన అలాంటి వారి నియోజకవర్గంలో వైసీపీనేతలను పవన్ చేర్చుకుంటు న్నారంటే అందుకు బలమైన కారణం ఉండే ఉంటుందని జనసేన నేతలు చెబుతున్నారు.

## ధర్మారెడ్డికి బిగిస్తున్న ఉచ్చు

తిరుమల, సెప్టెంబర్ 27, తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నిరంతరం సేవలు చేయడానికి ఎంతో మంది ఉద్యోగులు కృషి చేస్తారు. పరిపాలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను నియమిస్తుంది. అలా విధులు నిర్వహించిన ఓ అధికారి మాత్రం కనిపించడం లేదు. తిరుమల లడ్డూపై ఇంత వివాదం నడుస్తూన్నా ఇప్పటి వరకు స్పందించలేదు. ఐదేళ్లు అంతా తానై నడిపించిన ఆయన ఎక్కడ వెళ్లారో తెలియడం లేదు. తిరుమల అనగానే తిరుమల శ్రీవారు తరువాత స్వామి వారి లడ్డూ గుర్తుకు వస్తుంది. అలాంటి లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని, అపచారం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తరువాత ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది హిందువుల ఎంతో ఆవేదన చెందారు. అది పూర్తిగా గత పాలకుల తప్పుగా కూటమి ప్రభుత్వం ఆరోపిస్తుండగా.. కావాలనే కూటమి నాయకులు తమ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ వాదన.. అయితే ఇది పార్టీల కాదు గత ప్రభుత్వంలో టీటీడీని నడిపించిన ఆయనదే అంటున్నారు మరి కొందరు.ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎవరైనా ఒక్కసారి అయిన తిరుమలలో పని చేయాలని ఆశ పాడుతారు. టీటీడీ లాంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలో పనిచేస్తే దేశంలో ఎక్కడ అయిన పని చేసే అవకాశం ఉంటుందనేది కూడా వాస్తవం. అలాంటి సంస్థకు వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐఆర్ఎస్ అధికారిని నియమించారు.ప్రభుత్వం ఏర్పాడిన వెంటనే ఏవి ధర్మారెడ్డి కేంద్ర ప్రభుత్వ సర్వీసుల నుంచి ఏపీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. అక్కడ నంచి తిరుమల జేఈవోగా పదవి కల్పించారు. ఆ తరువాత అదనపు ఈవో తిరుమలకు జీవో విడుదల చేశారు. దీనిపై అప్పట్లో బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ ధర్మారెడ్డికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఇన్చార్జి ఈవోగా పదవి కేటాయించింది. ఐదేళ్ల కాలంలో తిరుమల జేఈవోగా... అదనపు ఈవోగా.. ఈవోగా... అప్పుడప్పుడు ఎస్వీబీసీ ఛైర్మన్‌గా... ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఇన్చార్జి వీసీగా ఇలా ఏదైన ధర్మారెడ్డి అనేలా పరిపాలన సాగింది. తాజాగా జరిగిన లడ్డూలు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు, ఇతర పదార్థాల టెండర్ వేయడం.. ఆమోదం పొందడం కూడా ధర్మారెడ్డి ఉండగానే సాగింది. ఇప్పుడు ఇంత వివాదం నడుస్తున్నా ధర్మారెడ్డి మాత్రం బయటకు రావడం లేదు. దీనిపై స్పందించడం లేదు. తిరుమలకు నెయ్యి సరఫరా చేయడం అంటే సాధారణ విషయం కాదు. పెద్ద పెద్ద ఉత్పత్తి చేసే సంస్థలు టీటీడీ వరకు రావు. అయితే తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ టెండర్ వేసి అతి తక్కువకు కోడ్ చేసి టెండర్ దక్కించుకోవడం ఒక ఎత్తు అయితే దానికి సంబంధించి లోడ్ పంపడం కూడా వెంట వెంటనే జరిగింది. అయితే 800 కిలో మీటర్ల దూరం ఉన్న డైరీకి 4 రోజుల వ్యవధిలో రెండు ట్యాంకులు సరఫరా చేయడం.. అందులో కూడా ట్యాంకుల పేర్లు వేరేగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇదంతా సిండికేట్ పనిగా అనుమానిస్తున్నారు. నెయ్యిలో సిండికేట్ కావాలనే పదార్థాలు కలిపారు అనే కోణంలో కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేయడంతో పాటు సిట్ విచారణలో మరిన్ని వివరాల బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదంతా మాజీ ఈవో ధర్మారెడ్డి చుట్టూ జరిగిన వివాదంగా... ఆయనను ఇందులో ప్రధాన సూత్రధారిగా కూడా చేర్చే ప్రయత్నమంటున్నారు వైసీపీ నాయకులు

## మరో ఐపీఎస్ చుట్టూ ఉచ్చు

ఏలూరు, సెప్టెంబర్ 27,ఏపీలో మరో ఐపీఎస్ చుట్టూ ఉచ్చు బిగిసుకుంటుందా? మాజీ ఎంపీ, ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు క్లయిమాక్స్‌కు చేరిందా? ఆనాటి సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ అడ్డంగా దొరికిపోయారా? రేపో మాపో ఆ ఐపీఎస్‌పై వేటు పడుతుందా? ఆ తర్వాత ఆయన్ని పోలీసులు విచారిస్తారా? అవుననే అంటున్నాయి పోలీసువర్గాలు.వైసీపీ పాలనలో చెలరేగిపోయిన ఐపీఎస్ అధికారులకు కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. ముంబై నటి కేసులో ముగ్గురు ఐపీఎస్‌లను చంద్రబాబు సర్కార్ సస్పెండ్ చేసింది. ఈ కేసులో అధికారాన్ని దుర్వినియోగం చేసినట్టు తేలింది. ఈ జాబితాలోకి మరో ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ చేరబోతున్నట్లు తెలుస్తోంది.జగన్ ప్రభుత్వంలో అప్పటి సీఐడీ చీఫ్‌గా వ్యవహరించారు పీవీ సునీల్‌కుమార్. ఆయన హయాంలో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన గుంటూరు పోలీసులు, నెల రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.కస్టోడియల్ టార్చర్ కేసు విచారణ చివరి దశకు వచ్చింది. ఇందులో భాగంగా సీఐడీ పోలీసులను విచారించారు గుంటూరు పోలీసులు. అందులో కీలక విషయాలు బయటకు వచ్చాయి. పీవీ సునీల్ కుమార్ సీఐడీ చీఫ్‌గా ఉన్న సమయంలో విధులు నిర్వహించిన సీఐ, ఎస్ఐలు కీలక విషయాలను బయటపెట్టారు.దీంతో ఐపీఎస్ సునీల్‌కుమార్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. విచారణలో సేకరించిన ఆధారాలతో డీఐజీకి నివేదిక ఇవ్వనున్నారు. అనంతరం ఆయన ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ క్రమంలో ఐపీఎస్ అధికారి సస్పెండ్ చేసి విచారించే అవకాశమున్నట్లు అంతర్గత సమాచారం.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో కొట్టామని అంగీకరించారు అప్పటి సీఐడీ అధికారులు. ఎంపీని కొడుతూ వీడియో కాల్‌లో సీఐడీ బాస్‌కు చూపించామని వెల్లడించారు. చివరకు సీఐడీ చీఫ్ నేరుగా తన సిబ్బందితో రఘురామరాజును నిర్బధించిన గదికి వచ్చి దగ్గరుండీ కొట్టించారని బయటపెట్టారు.వీడియో కాల్ చేశామని పోలీసులు చెప్పడంతో దానిపై నిర్ధారించుకున్నారు పోలీసులు.

## స్వభావ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత లో భాగంగా ఆధ్యాత్మిక ప్రదేశాల వద్ద శుభ్రత...



విభారె న్యూస్ సెప్టెంబర్ 27 ఎమ్మిగనూరు..స్వచ్ఛత హి సేవ కార్యక్రమం లో భాగంగా ఈనెల 17 నుండి అక్టోబర్ రెండు వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో మునిసిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు డి.ఈ.ఈ. నీరజ,శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వభావ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత లో పట్టణంలోని మత సంబంధమైన, ఆధ్యాత్మిక ప్రదేశాల అయిన అన్నమయ్య సర్కిల్ నందు దగ్గర సాయి టెంపుల్ ఆదోని బైపాస్ రోడ్డు నందు సాయిబాబా టెంపుల్ దగ్గర శుభ్రం చేయించి వాటి చుట్టుపక్క పరిసరాల్లో బ్లీచింగ్ వేయించడం జరిగింది. కావున ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు తెలియజేశారు. మెప్మా డిపార్ట్మెంట్ నుండి జయవర్ధన్,శానిటరీ, పర్యావరణ సెక్రటరీలు పాల్గొనడం జరిగింది.

## రాష్ట్ర మంత్రి కె.అచ్చం నాయుడు, నంద్యాల ఎంపీ మంగళగిరిలో వినతుల స్వీకరణ



-- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27–రాష్ట్ర వ్యవసాయం శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి లు శుక్రవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వినతులు స్వీకరించారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో ఇబ్బందులు పడిన బాధితులు పెద్ద సంఖ్యలో మంగళగిరిలోని కేంద్ర కార్యాలయం జరిగిన ప్రజా దర్బార్ కు వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని వినతులను రాష్ట్ర వ్యవసాయం శాఖ మంత్రి కె. అచ్చంనాయుడు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లకు అందించారు.వైసీపీ అక్రమ కేసులు, భూ దందాలు, భూ ఆక్రమణలు వంటి ఎన్నో సమస్యలతో ప్రజలు టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు ఇస్తున్నారని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబందిత శాఖల అధికారులను మంత్రి, ఎంపీ ఆదేశించారు.

## మున్సిపల్ ఎమ్ ఈగా గుర్రప్ప యాదవ్

### డీఈ గా నాగభూషణం రెడ్డి

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27–నంద్యాల మున్సిపాల్టీ లో భారీగా బదిలీలు జరిగాయి. మున్సిపల్ ఎమ్ ఈగా గుర్రప్ప యాదవ్ నియమితుల య్యారు. అలాగే డీఈ గా నాగభూషణం రెడ్డిని నియమించారు . ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడున్న ఎమ్ ఈ రమణ మూర్తి కడపకు బదిలీ అయ్యారు. అలాగే మున్సిపల్ డీఈ జయబారత్ రెడ్డి కడప కు బదిలీ అయ్యారు . రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా గుంతకల్లు లో ఉన్న గుర్రప్ప యాదవ్ నంద్యాల మున్సిపాలిటీ కి ఎమ్ ఈ నియమితులయ్యారు. అలాగే ఆదోని లో ఉన్న డీఈ నాగభూషణం రెడ్డి నంద్యాల మున్సిపల్ డీఈ గా నియమితులైనారు. ఇరువురుశుక్రవారంబాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ని కలసి మర్యాదపూర్వకంగా కలసి పూల బొక్కే ఇచ్చారు. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. మురళీధర్ ఉన్నారు.



# నీతి,నిజాయితీకి నిలువుటద్దం..

– ఢిల్లీ రాజకీయాలనే శాసించిన మేధావి కోట్ల విజయభాస్కరరెడ్డి..
– జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీక్రిష్ణ..

విభారె న్యూస్ సెప్టెంబర్ 27 కర్నూలు జిల్లా ప్రతినిధి..నీతి,నిజాయితీకి నిలువుటద్దం స్వర్గీయ కోట్ల విజయభాస్కర రెడ్డి అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు పి మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో జరిగిన స్వర్గీయ కోట్ల విజయభాస్కర రెడ్డి 23వ వర్థంతి సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కోట్ల విజయ భాస్కర రెడ్డి జిల్లాపరిషత్ చైర్మన్ గా, శాసనసభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా, కేంద్ర మంత్రిగా,రెండు పర్యాయాలు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా పనిచేసిన మహానేత అని నీతి నిజాయితీకి నిలువుటద్దం కోట్ల విజయభాస్కర రెడ్డి అని విలువలకు, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రాజకీయం చేశాడని" అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ని మీ మంత్రివర్గంలో నిజాయితీగల మంత్రులు ఉన్నారా అని ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు రాజీవ్ గాంధీ సమాధానమిస్తు అవును మా మంత్రివర్గంలో కోట్ల విజయభాస్కరెడ్డి లాంటి నిజాయితీ పరులున్నారని



చెప్పడం ఆయనకు కోట్ల మీద ఉన్న నమ్మకం ఎలాంటిదో అర్థమవుతోందని కోట్ల విజయభాస్కర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే పేద ప్రజలకు కిలో రెండు రూపాయలకు బియ్యం పంపిణీ చేసిన ఘనత ఆయనదేనని కోట్ల ఎంతో మంది నిరుద్యోగులకు చిన్న పేపర్ ముక్క ద్వారా సిఫారసు చేసి ఉద్యోగాలు ఇప్పించాడని కర్నూలు జిల్లా నందలి ప్రతి గ్రామంలో నాయకుల కార్యకర్తల పేర్లు గుర్తు పెట్టుకుని పేరుపెట్టి పిలిచేవారని ఢిల్లీ రాజకీయాలను శాసించిన ఘనత కోట్ల కి దక్కుతుందని కర్నూలు జిల్లా పేరును ఢిల్లీ స్థాయిలో నిలిపిన ఘనత స్వర్గీయ కోట్ల విజయ భాస్కర రెడ్డి కే దక్కుతుందని మురళీక్రిష్ణ కోట్ల విజయభాస్కర రెడ్డి సేవలను కొనియాడారు.ముందుగా మురళి కృష్ణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో స్థానిక హంద్రీ నది ఒడ్డున గల కిసాన్ ఘాట్ నందలి స్వర్గీయ కోట్ల విజయభాస్కర రెడ్డి సమాధిని దర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోట్ల సర్కిల్ నందలి కోట్ల విజయ భాస్కర రెడ్డి కాంస్య విగ్రహమునకు, పార్టీ కార్యాలయంలో కోట్ల విజయ భాస్కర రెడ్డి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, కాంగ్రెస్ నాయకులు దామోదరం రాధాకృష్ణ, కేఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులు యాదవ్,యు.వెంకటన్న, యన్ సి బజారన్న,కే వెంకటరెడ్డి,ఎస్ ప్రమీల,ఏ వెంకట సుజాత, డబ్ల్యూ సత్యరాజు,అనంతరత్నం, ఈ లాజరస్,సయ్యద్ నవీద్, షేక్ మాలిక్ భాష, ఎజాస్ అహ్మద్,బి సుబ్రహ్మణ్యం,ప్రతాపరెడ్డి, మిన్నెల్ల ఉసేన్, రమేష్, నడిపిన్న ఐఎన్టియుసి నాయకులు ఎన్ సుంకన్న మహిళా కాంగ్రెస్ కే వెంకటలక్ష్మి,కరుణమ్మ, మద్దమ్మ,ఎల్లమ్మ,సావిత్రి, సంజమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయండి

## జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27–జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ టూరిజం అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ క్విజ్ పోటీలలో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవంలో జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని వీటన్నింటినీ మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని టూరిజం అధికారులను సూచించారు. జిల్లాలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, ప్రఖ్యాతిగాంచిన గుహ సంపదలు ఉన్నాయని వాటన్నింటినీ ప్రోత్సహించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే పర్యాటక రంగంపై అవగాహన పెంపొందించుకోవాలని జేసి సూచించారు. పర్యాటక రంగం ద్వారానే ప్రపంచంలోని అన్ని దేశాలు శాంతి మరియు ఆర్థికంగా అభివృద్ధి చెందాయన్నారు. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్నాయని జాయింట్ కలెక్టర్



వివరించారు. పర్యాటక రంగం వల్ల ఆదాయం వనరులు సమకూరి దేశ వృద్ధిరేటు పెరుగుతోందన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా విద్యార్థులలో జిల్లాలోని ప్రధాన దేవాలయాలు, చారిత్రాత్మక ప్రదేశాలు, కట్టడాలు తదితర అంశాలలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు.పర్యాటక రంగ అభివృద్ధి అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రముఖ పర్యటక ప్రదేశాలను ఏడు టూరిజం సర్క్యూట్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వదేశీ దర్శన్ 2.0 ఛాలెంజ్ డెస్టినేషన్ జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన వివిధ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రధానం చేశారు.

# అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తిచేయండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27 – జిల్లాలో 439 అంగన్వాడీ కేంద్రాల్లో 231 టాయిలెట్లు, 425 త్రాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం 1.55 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓలతో సమావేశం నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో టాయిలెట్ నిర్మాణానికి 36 వేల రూపాయల చొప్పున 231 టాయిలెట్లకు 83.16 లక్షలు, మంచినీటి సదుపాయం కోసం 17 వేల రూపాయల చొప్పున 425 అంగన్వాడి కేంద్రాలలో 72.25 లక్షలు... మొత్తం 656 పనులకు గాను కేంద్ర ప్రభుత్వం1.55 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందన్నారు. ఒక్కో టాయిలెట్ నిర్మాణాన్ని మనసుపెట్టి చేస్తే మూడు రోజులలో చేయవచ్చుని... ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మంచినీటి సదుపాయం, టాయిలెట్ల నిర్మాణాలకు సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించి అక్టోబర్ 15 తేదే లోగా నాణ్యతతో పూర్తి పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆలస్యం చేసే కొద్ది మెటీరియల్ కాస్ట్ పెరగడంతో పాటు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేమన్నారు. సంబంధిత అంగన్వాడీ కేంద్రాల




సిడిపిఓలు ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సంప్రదించి పనుల పురోగతిపై ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారునిర్మాణాలు పూర్తయిన వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలకు త్రాగునీటిలో కెమికల్, బ్యాక్టీరియల్ కంటామినేషన్ లేకుండా శుద్ధమైన నీటిని సరఫరా చేయాలన్నారు. టాయిలెట్ల నిర్మాణాల పనులకు సంబంధించి సంబంధిత ఎమ్మెల్యేల నోటీసులలో ఉంచి అప్పగించిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.ఉపాధి హామీ కింద 100 రోజుల ప్రణాళికలో భాగంగా నాలుగు కిలోమీటర్ల సిసి డ్రైన్ల లక్ష్యానికి గాను 2.8 కిలోమీటర్ల డ్రైన్లు పూర్తయిందని, పెండింగ్ లో ఉన్న 1.2 కిలోమీటర్ల సిసి డ్రైన్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. 200 రోజుల ప్రణాళికలో భాగంగా 9 కిలోమీటర్ల మేర సిసి డ్రైన్ల నిర్మాణాలను డిసెంబర్ రెండవ వారం నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందని ఈ మేరకు లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జలజీవన్ మిషన్ లో ఇంటింటి కొళాయి కనెక్షన్లలో వున్న సమస్యలను అధిగమించి పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈ లు అన్ని ప్రాజెక్టుల సిడిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## మూడవవిడత మొబైల్ రికవరీ మేళా

### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27–నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 2426 మొబైల్ లను రికవరీ చేయడం జరిగినది. మొత్తం వాటి విలువ 4,82,65,429/- రూ. మొబైల్ ఫోన్ లు పోగొట్టుకున్నవి రికవరీ చేసి ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసిన బాధితులు.ఆంధ్రప్రదేశ్ డిజిపి ద్వారకా తిరుమల రావు ఆదేశాలమేరకు మరియు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ పర్యవేక్షణలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో మొబైల్ రికవరీచేయడం జరిగింది. ఈ మొబైల్ లను వివిద రాష్ట్ర లనుండి అనగా మహారాష్ట్ర, తమిళనాడు ,కర్ణాటక, గోవా , తెలంగాణా మొదలగు రాష్ట్రాల నుండి మరియు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం, తూర్పుగోదావరి, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం మొదలగు జిల్లాల నుండి మరియు నంద్యాల జిల్లాలో వివిద ప్రాంతాల నుండి 1066 జిల్లా పోలీసు కార్యాలయంలో "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా పోలీసులు ముందు రోజే ఫోన్ల ను అందజేసేందుకు బాధితులకు సమాచారం అందించి నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంకు పిలిపించి బాధితులకు సెల్ ఫోన్లను అందజేశారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ గారు మిడియాతో మాట్లాడారు. ఇటీవల కాలంలో మొబైల్ మన జీవితంలో ఒక భాగమైందన్నారు. మొబైల్ ఫోన్ లతో పాటు ప్రజల ఆస్తిని కాపాడాల్సిన భాద్యత పోలీసులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు నంద్యాల టౌన్ డిఎస్పి యుగంధర్ బాబు గారు ఏఆర్ డి.ఎస్.పి శ్రీనివాసులు , ఇన్స్పెక్టర్లు ప్రియతం రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఇస్మాయిల్, ఆదినారాయణ ,అర్ ఐ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు చేయూత




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 27–విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎగ్జిబిషన్ శ్రీనివాస్ చౌదరి 10 వేల రూపాయల రసీదును మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ కు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్నాల రవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190